
ఆదివారం 9 ఫిబ్రవరి 2025 5 అనంతపురం





అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ బాలస్వామి



జూన్‌లోపు నామినేటెడ్ భర్తీ..!

జూన్‌లోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నాడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమయంలో ఆయన నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపైనా మాట్లాడారు. జూన్ నెలలోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు.

- ప్రజాప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి
- పదవులపై ఆశావహుల ఎదురుచూపు
- దక్కించుకునేందుకు యత్నాలు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో టిడిపి ఎప్పుడూలేని విధంగా అన్ని స్థానాల్లోనూ విజయం సాధించింది. దీనికితోడు ఈసారి కూటమి పార్టీలు ఉన్నాయి. టిడిపితోపాటు, బిజెపి, జనసేన పార్టీలూ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాయి. పదవుల్లో వీరికి పంపకాలు చేయాల్సి ఉంది. ఇప్పటికే అహుడా ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీల నుంచి కూడా ఆశావహులు ఉండటంతో టిడిపి నేతల్లో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో సందిగ్ధత నెలకొంది. తమకు పదవులు వస్తాయా.. లేదా అన్న గుబులు నెలకొంది. మొదటి మూడు పంపకాల్లో జిల్లాలో ముఖ్య నేతలకు ఆశించిన పెద్ద పదవులేవీ రాలేదు. ఇప్పుడు మార్కెట్‌యార్డు, దేవాలయాల ఆలయ కమిటీల్లో నైనా అవకాశాలు దక్కుతాయా లేదా అన్న సందేహాలు టిడిపి నాయకుల్లో కన్పిస్తున్నాయి. పదవుల కేటాయింపును త్వరగా తేలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతోంది.

సహకార సంఘాలపైనా ఆశలు

నాయకులు నామినేటెడ్ పదవులే కాకుండా సహకార సంఘాలపైనా ఆశలు పెట్టుకున్నారు. ఈ సంఘాలకు ఎన్నికలు జరగక చాలాకాలమైంది. గత ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జీలను పెట్టి వారితోనే సహకార సంఘాలను కొనసాగించింది. టిడిపి ప్రభుత్వం మాత్రం సహకార సంఘాల ఎన్నికలకూ కసరత్తును చేపట్టింది. సభ్యత్వాలను చేపడుతున్నారు. ఎన్నికలు నిర్వహించే అవకాశాలే అధికంగానున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలు జరిగితే పార్టీ తరుపున పోటీ చేసేందుకు కొంత మంది సిద్ధమవుతున్నారు. ప్రతిపక్ష వైసిపి ఎన్నికల బరిపై పెద్దగా ఆసక్తి చూపే పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. చాలా వరకు కూటమి మద్దతుదారులు ఏకగ్రీవం చేసుకున్నారు. అదే ఫార్ములా సహకార సంఘాల ఎన్నికలు జరిగినా అమలు జరుగుతుందని అధికార టిడిపి నేతలు భావిస్తున్నారు. ఏది ఏమైనా అన్ని నామినేటెడ్ పదవులనూ త్వరితగతిన భర్తీ చేయాలని టిడిపి నేతలు కోరుతున్నారు.

ముసాయిదా బడ్జెట్‌కు మోక్షం..!

వెంటనే సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశాలు

ఇంతకాలం ఆలస్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ తయారీ తెరపైకి వచ్చింది. బడ్జెట్ ముసాయిదా ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా ఆ దిశగా అకౌంట్ సెక్షన్ చర్యలు చేపట్ట లేదు. శనివారం నాడు టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అకౌంట్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కమిషనర్ బాలస్వామి విస్తత స్థాయి సమావేశం జరిపారు. ఇప్పటికే ముసాయిదా బడ్జెట్‌ను సిద్ధం చేసి ఆమోదించాల్సి ఉండగా ఆ దిశగా కనీస చర్యలు చేపట్టకపోవడంపై కమిషనర్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది పని చేస్తున్నారా.. లేక నిద్రపోతున్నారా.. అంటూ ఘాటుగానే వ్యాఖ్యానించారు. టౌన్ ప్లానింగ్ నుంచి ప్రచార బోర్డులు, ప్రచార పన్ను తదితర అంశాలకు సంబంధించిన వివరాలపై కమిసనర్ ఆరా తీశారు. రెవెన్యూ విభాగంలో ఆస్తి, నీరు, ఖాళీ జాగా పన్నులు, వివిధ పద్దుల కింద వస్తున్న రాబడి, పేరుకుపోయిన బకాయిలు, అంచనా వ్యయాలు తదితర పద్దులపై చర్చించారు. ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య పనులకు అవసరమైన పనిముట్లు, పరకలు, గంపలు, బ్లీచింగ్, సున్నం తదితర వాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు ఏమేర జరిగాయి..? వాస్తవికత ఆధారంగా కేటాయింపులు జరిగాయా..? గాలివాటంగా గత బడ్జెట్ ప్రతిపాదనల ఆధారంగా పద్దుల కేటాయింపులు జరిగాయా.? అన్న అంశాలపై కమిషనర్ వివరాలు తీసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో వీధిలైట్లు, వాటర్ వర్క్స్, విద్యుత్ అవసరాల ఖర్చుల ఆదాయ వ్యయాలపైనా చర్చించారు.

ముసాయిదా బడ్జెట్‌లో తలమునకలు

కమిషనర్ ఆదేశాల మేరకు ముసాయిదా బడ్జెట్ రూపకల్పనలో ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ గుమస్తాలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బిఎల్.నరసింహులు బడ్జెట్ ప్రతిపాదనల తయారీలో నిమగ్నమయ్యారు. ముసాయిదా బడ్జెట్ తయారీలో కీలకపాత్ర పోషించాల్సిన అకౌంట్ విభాగం సిబ్బంది మాత్రం ఇందులో పాలుపంచుకోలేదు. వివిధ విభాగాల పద్దుల కింద అంచనా, రాబడి, వ్యయాల రూపకల్పన చేయాలంటే అందుకు సంబంధించి ఆయా విభాగాల సిబ్బంది పూర్తి వివరాలు సేకరించాల్సి ఉంటుంది. గడచిన మూడు నెలల్లో కార్పొరేషన్‌లో విధులు నిర్వహించిన కమిషనర్లు ఆదిశగా చర్యలు చేపట్టలేదు. గడచిన కొన్ని నెలుగా కార్పొరేషన్‌లోని పలు విభాగాల అధికారులు చుట్టపు చూపుగా విధులకు వచ్చి తర్వాత దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ముఖ్య అధికారులు కూడా ఇలానే చేయడంతో అన్ని విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు నెల రోజుల సెలవు కాలం ముగిసినా ఇంకా విధుల్లో చేరలేదు. మరికొన్ని రోజులు సెలవు పొడిగించడంతో టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్‌ఛార్జుల పాలనలో కొనసాగుతోంది. మెప్మా విభాగంలో టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్, సిటీ మిషన్ మేనేజర్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగంలో ఫిబ్రవరి నెలలో ఇద్దరు కీలక అధికారులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. రెవెన్యూ విభాగంలో రెండు నెలల క్రితం జరిగిన బదిలీలతో వచ్చిన నూతన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. చాలా విభాగాల్లో పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. ఈ పరిస్థితుల్లోనే ముసాయిదా బడ్జెట్ రూపకల్పన ఇప్పటికీ జరగలేదు. ప్రస్తుత కమిషనర్ దీనిపై దృష్టి సారించడంతో ముసాయిదా బడ్జెట్ రూపకల్పనలో అధికారులు నిమగ్నం అయ్యారు. ఒక్కసారిగా బడ్జెట్ రూపకల్పన చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంతో సిబ్బంది అందరూ ఆపసోపాలు పడుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని రైతు భరోసా కేంద్రం

ప్రజాశక్తి-కుందుర్పి



నిరుపయోగంగా ఉన్న ఆర్‌బికె

మండల పరిధిలోని నిజవల్లి గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. గత వైసిపి ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించారు. అయితే నెలల తరబడి ప్రారంభానికి నోచుకోకపోవడంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోందని స్థానికులు అంటున్నారు. పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా భవనం ప్రారంభానికి నోచుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిజవల్లి గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు ఉపయోగపడేలా చేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.



సమస్యలను వివరిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్

సిఎం చంద్రబాబును కలిసిన జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ విజయవాడలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు అంశాలపై అధినేత దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ సభ్యత్వాల నమోదు, ప్రభుత్వ కార్యక్రమాల్లో నాయకులు కార్యకర్తల చొరవ, ప్రజల సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలపై వివరించారు. జిల్లా అభివృద్ధికి సంభందించిన అంశాలను ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు.

రైల్వే లోకో డీజిల్‌షెడ్ తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్‌ను గుంతకల్లు డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా శనివారం సందర్శించారు. ముందుగా ఆవరణలో మొక్కలు నాటారు. షెడ్‌లో పర్యటించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వెబ్ టెక్ ఇంజన్‌కు సంబంధించి లోడ్‌బాక్స్‌ను ప్రారంభించారు. రైల్వే అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. షెడ్ నిర్వహణ, తుప్పు వస్తువులతో తయారుచేసిన బొమ్మలపై రైల్వే అధికారులు, కార్మికులను అభినందించారు. తర్వాత రైల్వే ఆసుపత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీజిల్‌షెడ్ సీనియర్ డిఎంఇ ప్రమోద్, ఎడిఎంఇ సుంకన్న, ఎస్ఎంఎం శ్రవణ్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు మనోజ్, ప్రభుదాసు, రైల్వే ఆసుపత్రి డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ వెంకటేశ్వరరావు, కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, డీజిల్



గుత్తి డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్‌ను తనిఖీ చేస్తున్న గుంతకల్లు డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా

14 నుంచి 'అనంత బాలోత్సవం'

- లలిత కళాపరిషత్‌లో మూడు రోజులపాటు పిల్లల పండుగ
- పోస్టర్ విడుదల చేసిన బాలోత్సవ కమిటీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాలోత్సవ కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 14, 15, 16వ తేదీల్లో అనంతపురం నగరంలో 'అనంత బాలోత్సవం -5' నిర్వహించనున్నట్టు అనంత బాలోత్సవ కమిటీ వెల్లడించింది. ఈ మేరకు ఈ మూడు రోజుల కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆహ్వాన కమిటీ విడుదల చేసింది. శనివారం ఉదయం స్థానిక క్రిసెంట్ స్కూల్‌లో కమిటీ అధ్యక్షురాలు ఎస్.షమీమ్ షఫివుల్లా ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలోత్సవం నిర్వహణపై మీడియాతో మాట్లాడారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా అనంతపురం నగరంలో అనంత బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఐదవ సంవత్సరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎప్పటిలాగా అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాకుండా ఈసారి లలిత కళాపరిషత్‌లో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ విషయాన్ని పిల్లలు, పాఠశాల యజమాన్యాలు గుర్తించాలని సూచించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ పిల్లల్లో చదువుల ఒత్తిడిని తగ్గించి, వారిలోనున్న ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా పిల్లల్లో దేశభక్తి, సమైక్యతను చాటే విధంగా ఉండాలని కమిటీ భావిస్తోందన్నారు. మరో సభ్యురాలు వి.సావిత్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వేలాది మంది విద్యార్థులు భాగస్వామ్యులవుతారని చెప్పారు. మొత్తం సాంస్కృతిక పోటీలతోపాటు, అకడమిక్ విభాగాల్లో వేరువేరు తరహాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను పిల్లల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో అనేక మంది సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ పిల్లల పండుగలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్, చంద్రకళ, రామాంజినమ్మ, ఓతూరు పరమేష్, సురేష్ పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-రాప్తాడు



ల్యాబ్‌లో అరటి పిలకలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం పోత్రాహం అందిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఈమేరకు మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లి ఎపిఐఐసి పారిశ్రామిక వాడలో ఉద్యాన శాఖ ప్రోత్సాహం ద్వారా ఏర్పాటు చేసిన ఎలైట్ బయోటెక్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇందులో భాగంగా ల్యాబ్‌లో ఉన్న అరిటి మొక్కల పెంపకాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగు చేయాలనుకునే రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై డ్రిప్పు, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 12వతేదీన మండల కేంద్రంలోని బైపాస్ సర్కిల్‌లో ఎపి సూక్ష్మ సాగునీటి పథకం, ఉద్యాన శాఖ పంపిణీ చేయనున్న పరికరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండల రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల యజమానులు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి, నాయకులు కొండప్ప, తిరుపాల్, శ్రీనివాసులు, ఎపిడి ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన అధికారి రత్నకుమార్, గొందిరెడ్డిపల్లి ఎంపిటిసి జాఫర్‌ఖాన్, సర్పంచు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల రద్దుపై ఉద్యమిస్తాం

ఎపిటిఎఫ్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆదర్శ పాఠశాలల పేరుతో వేలాది పాఠశాలల రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించనున్నట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్ రాయల్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వకు కార్యదర్శి బి.నరసింహులు అన్నారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత పాఠశాల విద్య విధానాల కంటే మెరుగైన విద్యా విధానాన్ని అందిస్తామని కూటమి ప్రభుత్వం వేలాది ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల మూసివేతకు తెరలేపుతోందన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యా హక్కు చట్టం మేరకు పొందాల్సిన విద్యను పొందలేక డ్రాప్ అవుట్ అయ్యే పెను ప్రమాదాన్ని చవిచూడబోతున్నారని తెలిపారు. విద్యా శాఖ అధికారులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి పెంచి జీవనోపాధి నిమిత్తం పక్క రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థుల పేర్లు తొలగించడం హేతుబద్ధీకరణ పేరుతో ఆదర్శ పాఠశాలల పేరుతో వేలాది పాఠశాలలను మూసివేసే ప్రణాళికలు రచించిందన్నారు. ఆర్థిక భారం అంటూ పాఠశాలలు పూర్వ విధానంలో కొనసాగించడం మాని పాఠశాలలు రద్దు, పోస్టులు రద్దుకు దారితీసేలా ప్రత్యామ్నాయ విధానం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆదర్శ పాఠశాలల స్థానంలో యథావిధిగా 117 జీవో కన్నా ముందున్న విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలను రద్దు పరచకుండా కొనసాగించాలన్నారు. లేని పక్షంల దశలవారీ పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, నరేష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్

కార్పొరేట్లకు మేలు చేసేలా బడ్జెట్

14 నుంచి 20 వరకు నిరసనలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్


ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్లకు మేలు చేసేదిలా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ప్రజా సంక్షేమం ఎక్కడా లేదన్నారు. ముఖ్యమైన రంగాలకు నిధులు కేటాయించకపోవడంతో దేశ ప్రజలందరూ నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి చర్యలు లేవన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంపై కేంద్రం ఎలాంటి స్పష్టతనూ ఇవ్వలేదన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం తదితర వాటి కేటాయింపులు గతేడాదికి కంటే తగ్గించారన్నారు. ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులను కేటాయించాల్సి ఉండగా ఆ దిశగా కేటాయింపులు చేయకపోవడం విచారకరం అన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుతో ప్రజలపై మరింత భారాలను మోపిందన్నారు. బడ్జెట్‌లో చేసిన మోసాన్ని తెలియజేసేలా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకిస్తూ ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, లక్ష్మీనారాయణ, జిఎల్.నరసింహులు, పట్టణ కమిటీ నాయకులు ముస్తాక్, బాబ్‌జాన్, జగన్, రామ్మోహన్, రఫీ, ఉదయ్, అంజి, అఖిల్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి

పెద్దవడుగూరు : వసతిగృహాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకుని, ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు సూచించారు. స్థానిక బాలుర, బాలికల వసతి గృహాల్లో శనివారం ఆరోగ్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు పరిశుభ్రతను పాటించి ఆరోగ్యవంతంగా ఉండాలని చెప్పారు. ఆనంతరం ఆయా వసతి గృహాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వసతిగహాల వార్డెన్లు ఉమాదేవి, సంజీవరాయుడు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వీరన్నపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఆరోగ్య సూపర్‌వైజర్ శ్రీనివాసులు పాల్గొని నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు.

జాతీయ రహదారి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల : అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం జాతీయ రహదారి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా శింగనమల మండలకేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద శింగనమలకు వెళ్లే మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే శింగనమల మరవకొమ్మ రోడ్డుకు అనుసంధానం చేసే క్రమంలో హైవే రోడ్డులో అండర్ పాస్ రోడ్డు ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు.



గాంధీ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

యూనియన్‌ను నీరుగార్చేందుకు


కార్మికులపై కక్షసాధింపు

సిఐటియు నాయకులు ఉమాగౌడ్, హనుమంతురెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్‌ను దెబ్బతీయడానికే ఆ యూనియన్ నాయకులు రామాంజనేయులు, జుబేర్‌పై కమిషనర్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సిఐటియు నాయకులు ఉమాగౌడ్, హనుమంతురెడ్డి ఆరోపించారు. రామాంజనేయులు, జుబేర్ విధుల్లో మార్పు చేసి భయాందోళనకు గురి చేస్తూ యూనియన్‌ను విచ్ఛిన్నం చేయాలనే కుట్రపూరిత చర్యలను నిరసిస్తూ ఆరు రోజులుగా సిఐటియు నాయకులు, ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసనలు శనివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో గాంధీజీ విగ్రహం వద్ద ప్లకార్డులను చేత పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజుల నుంచి కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. 125 మంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఉండగా కేవలం ఇద్దరు కార్మికులు యూనియన్‌కు నాయకత్వం వహిస్తున్నారని నెపంతోనే ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కార్మికులపై వివక్షను మానుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ప్రాధాన్యత ఏదీ ..!?




ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ఈ వారంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యత ఏ మాత్రమూ లభించలేదు. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా అనంతపురం జిల్లా ఉంది. రాజస్థాన్‌లోని జైసల్మీర్ తరువాత అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం కూడా ఇదే. ఇటువంటి వెనుకబడిన ప్రాంతాలకు తగిన ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి పరుస్తామని విభజన సమయంలోనూ ప్రకటించారు. రాష్ట్ర విభజన జరిగి దశాబ్దకాలం పూర్తయ్యింది. అయినా ఇప్పటి వరకు జరిగిన పది బడ్జెట్‌ల్లోనూ చెప్పుకోదగిన ప్రాధాన్యత ఏదీ లభించలేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఒక్క కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు వరకు జరిగింది. దానికి కూడా నిధుల కేటాయింపులు అరకొరగానే ఉంటూ వస్తున్నాయి. 2018లో దీని ప్రారంభం జెఎన్‌టియులోని ఇంక్యూబేషన్ కేంద్రంలో ప్రారంభించారు. ఆ తరువాత కార్యాలయం అక్కడే ఏర్పాటు చేసి క్యాంపస్‌ను బయట ప్రయివేటు ఇంజినీరింగు ఖాళీ భవన సముదాయంలో మార్చారు. ఇటీవలే దీన్ని సొంత స్థలంలోకి మార్పు చేశారు. అక్కడ ఇంకా పూర్తి స్థాయి మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. గడిచిన రెండేళ్లుగా ఈ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపుల్లేవు. అంతకు మునుపు భవన నిర్మాణానికి మంజూరు చేసిన రూ.112 కోట్లతోనే సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికీ శాశ్వత ఉద్యోగుల నియామకాలు పూర్తి స్థాయిలో జరగలేదు. పూర్తిస్థాయి విశ్వవిద్యాలయంగా ఏర్పాటైయ్యేందుకు ఎంత సమయం పడుతుందన్నది చూడాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేటాయిస్తామన్న నిధులేవీ లేవు. ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తగిన ప్రాధాన్యత లభిస్తుందని ఆశించారు. రాష్ట్రానికిగానీ, ఇటు వెనుకబడిన అనంతపురం జిల్లాకుగానీ పెద్దగా ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. గుంతకల్లు డివిజన్‌కు కూడా ఆశించినంత నిధుల కేటాయింపుల్లేవన్న అసంతృప్తి సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఈ వారంలో అనంతపురంలో ఉద్యావన సమ్మేళనాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉద్యానవనానికి ఊతమిస్తామని ప్రభుత్వం చెబుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పుడున్న ఉత్పత్తిని ఏడాదికి 25 శాతం చొప్పున పెంపుదల చేస్తామని కూడా ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. ఈ ఉత్పత్తి పెంపుదలకు ప్రభుత్వం ద్వారా ఏ రకమైన సహకారం అందుతుందన్నది మాత్రం ప్రకటించలేదు. ఇప్పటికీ ఉద్యానవన రైతులకు గిట్టుబాటు ధరలేదు. ఉద్యానవన పంటల్లో అత్యధికంగా ఉండే మిర్చి రైతు ఇప్పుడు ధరలేక అవస్థలు పడుతున్నారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వం ద్వారా ఏ రకంగా సహకారం అందిస్తారన్నది ఈ కాంక్లేవ్‌లో లేదు. ఒకవైపు ఉద్యానవనానికి ఊతమిస్తామంటూనే మరోవైపు డ్రిప్ లక్ష్యాన్ని ప్రభుత్వం కుదించింది. జిల్లాలో అత్యధికంగా పండే టమోటా, మామిడికి ధరలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉద్యానవన సమ్మేళనంలో మాత్రం అంతా బాగుందని చెప్పే ప్రయత్నం చేశారు. ఉద్యానవన పంటలకు ఏ రకంగా ఊతం ఇవ్వొచ్చు... మార్కెటింగ్‌పై ఏ రకంగా చర్యలు తీసుకుంటారన్న దానిపై స్పష్టత ఇవ్వలేదనే చెప్పాలి. కంపెనీలను మరింతగా ముందుకు తీసుకొచ్చి రైతులను వారికి అప్పగించే విధంగా ప్రభుత్వ తీరుందన్న విమర్శ వ్యక్తమవుతోంది. ఒక రకంగా కాంట్రాక్టు వ్యవసాయాన్ని పరోక్షంగా ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ వైఖరి కనిపిస్తోందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. కంపెనీలొచ్చి ముందుగానే రైతు ఏ రకమైన పంట పండించాలి... దానికి అవసరమైన ఇన్‌ఫుట్స్ కూడా ఇచ్చి వారే మార్కెటింగ్ చేసుకుంటారు. రైతుకు ఎంతోకొంత చేతిలో పెట్టి కంపెనీలు లాభాలు దండుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఇది వరకే కాంట్రాక్టు వ్యవసాయం జిల్లాలో ప్రారంభించే ప్రయత్నాలు సాగాయి. గతంలో అరటి పంటను ఇదే రకంగా కంపెనీలకు ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహించింది. ప్రభుత్వ రాయితీలు పొందిన కంపెనీలు సరైన సమయంలో రైతుల నుంచి పంట కొనుగోలు చేయలేదు. దీంతో యల్లనూరు, పుట్లూరు మండలాల్లో అరటి రైతులు నష్టపోయారు. ఆ సమయంలో సమస్యను అధికారుల దృష్టికి రైతులు తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండాపోయింది. ముందుగా కొంటామన్న ధరకు కంపెనీలు కొనుగోలు చేయకుండా చేతులెత్తేయడంతో రైతులు బయట అమ్ముకోవాల్సి వచ్చింది. నిర్దిష్టమైన ప్రణాళికతో రైతుకు ఉతమిచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకురావాలని రైతు సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

కళ్యాణదుర్గం వైసిపి కన్వీనర్‌గా గోళ్ల సూరి



కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మండల వైసిపి కన్వీనర్‌గా గోళ్ల సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశల కృషి చేస్తున్న తనను పెద్దలు గుర్తించి కన్వీనర్ పదవి కేటాయించడం సంతోషకరమన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన అధినేత, మాజీ సిఎం జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి తలారి రంగయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుతోనే బిసిలకు రాజ్యాధికారం

బ్రహ్మసముద్రం : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే బిసిలకు రాజ్యాధికారం సాధ్యమని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కురుగౌడ, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నీలాస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుండిగానిపల్లి గ్రామంలో ప్రజాశక్తితో మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టులలో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపిన ఘనత చంద్రన్నకే దక్కుతుందన్నారు. దీనికితోడు ఉద్యానవన రంగానికి ఊతం ఇచ్చేందుకు డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ పథకంతో రాయలసీమ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతేగాకుండా రాయలసీమ రైతులు పూర్తిస్థాయిలో అభివద్ధి చెందుతారన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌కు సన్మానం



మండల కన్వీనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : నూతనంగా ఎంపికైన వైసిపి మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డిని మండల వైసిపి నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా బొకేలు అందజేసి శాలువాలు, పూలమొక్కలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు మాముడూరు అయ్యన్న, వాల్మీకి మండల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి గోవిందు, పాల వెంకటాపురం ఎంపిటిసి శివన్న, ఎంఆర్‌పిఎస్ తాలూకా అధ్యక్షులు నాగరాజు, నాయకులు కొల్లప్ప, మల్లి, వన్నూరుస్వామి, ఆటో ఆనంద్, లింగప్ప, గంగాధర్, నాగరాజు, నాగిరెడ్డిపల్లి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

11న ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలో ఉన్న బాలాజీ ఎంబిఎ కళాశాలలో ఈనెల 11వతేదీ మంగళవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రముఖ డీ మార్ట్ బహుళజాతీయ కంపెనీకి చెందిన ప్రతినిధులు హాజరైన ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు బయోడేటాతోపాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో కళాశాలలో హాజరుకావాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

రాయదుర్గం : నిరుపేద కుటుంబ కుటుంబ యజమాని మృతిచెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు అవసరమైన ఆర్థికసాయం చేసిన పోలీసులు తమ మానవత్వాన్ని చాటుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గతనెల 31న ఓ వ్యక్తి అనారోగ్యంతో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. అతడు శుక్రవారం మరణించాడు. అయితే అతడి ఊరు.. పేరు చిరునామా ఆచూకీ ఆసుపత్రి సిబ్బందికి తెలియకపోవడంతో విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు ఈ విషయం సోషల్ మీడియా ప్రచారం చేశారు. సోషల్ మీడియాలో మృతుడి ఫొటోను గుర్తుపట్టిన కుటుంబ సభ్యులు అతడి పేరు చన్నవీరాగా గుర్తించి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వచ్చారు. అయితే ఆర్థిక ఇబ్బందులతో మృతదేహాన్ని కూడా తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్న విషయాన్ని గమనించిన పోలీసులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకెళ్లేందుకు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

శింగనమల : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలం పరిధిలోని బండమీదపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కుటుంబాన్ని టిడిపి నాయకులు శనివారం పరామర్శించారు. బండమీలపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో నాగరాజు మృతిచెందాడు. మృతదేహాన్ని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పెద్దాసుపత్రిలోని మార్చురీ గదికి వెళ్లి నాగరాజు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రామన్నయాదవ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకం పోస్టర్లు ఆవిష్కరణ


అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని రైల్వే ఫీడర్ రోడ్డులో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్వహించనున్న మహా కుంభాభిషేకం మహోత్సవ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీ మాట్లాడుతూ అనంతమైన దేవకీశక్తిని మరలా ప్రతిష్టించి ఆలయానికి దైవిక శక్తిని పెంపొందించే మహా అద్భుతమైన మహిమాన్వితమైన మహా కుంభాభిషేకాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు హరికిషోర్, ఆలయ కమిటీ ట్రెజరర్ తాళంకి వెంకటేష్ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

శింగనమల : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచన మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు విచ్చేసిన గర్భిణులకు శనివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది దివ్య, శైలజ, బీసీ హాస్టల్ వార్డెన్ మస్తాన్, టిడిపి నాయకులు సి.వెంకటేశు, శంకర్, విజయ్, చిన్నలింగన్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైసిపి నూతన కన్వీనర్లకు అభినందనలు

గుత్తి : నూతనంగా నియమితులైన వైసిపి గుత్తి పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జి.గంగరాజు యాదవ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని కె.మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఇరువురి కన్వీనర్లకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు పలువురు శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జయరంగారెడ్డి, వైసిపి నాయకులు ఎస్.రాముయాదవ్, ఎస్.సుధాకర్ యాదవ్, బి.సురేష్, వెంకటరాముడు, హరినాథ్‌రెడ్డి, చాంద్‌బాషా, సూర్యప్రకాష్, ఎల్ఐసి హరినాథ్‌రెడ్డి, ప్రశాంత్, రాజేష్, ఇబ్రహీం, వరిగడ్డి షేక్షావలి, వెంకటేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, బోయగడ్డ రాము, రామాంజనేయులు, లాలు, తదితరులు పాల్గొన్నారు.



గుత్తి పట్టణ, మండల వైసిపి కన్వీనర్లను సన్మానిస్తున్న నాయకులు

వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-యాడికి

వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకునే బాధ్యత నాయకులపై ఉందని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులందరూ రోజూ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేసిన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గండికోట లక్ష్మణ్, టిడిపి పట్టణ కార్యదర్శి వెలిదండ్ల ఆదినారాయణ, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, టిడిపి నాయకులు నరసింహచౌదరి, మైనారిటీ కార్యదర్శి సుభాన్, స్టోర్ డీలర్లు మహమ్మద్ రఫిక్, చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన 'అధ్యాపకుల అభివృద్ధి'

ప్రజాశక్తి-గుత్తి

గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గేట్స్ హ్యూమానిటిస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించిన 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ నావెల్ డ్రగ్ డెలివరీ' అనే అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం శనివారం ముగిసింది. కార్యక్రమానికి దక్షిణ కొరియాలోని పుసాన్ యూనివర్సిటీ పాలిమర్ సైన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఇల్దోచుంగ్ ప్రధాన వక్తగా, అమెరికా, చీలి దేశాలకు సంబంధించిన యూనివర్సిటీల ప్రొఫెసర్లు కార్యక్రమంలో వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాలిమర్ డ్రగ్ డెలివరీ అనే నూతన విధానం ద్వారా క్యాన్సర్, టిష్యూ ఇంజినీరింగ్, పిన్ ట్రాక్టిక్ క్యాన్సర్‌పై సమగ్రంగా చికిత్స చేస్తున్నారు. గేట్స్ కళాశాల వేదికగా ఐదు రోజులపాటు జరిగిన ఎన్‌డిపికి దాదాపు 300 మంది అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు హాజరయ్యారని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ఎండి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి హరిప్రియ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎర్రిస్వామి, కో ఆర్డినేటర్లు ఝూన్సీ, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఎఎస్‌సి' అజంతా షూ షోరూం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న షోరూం

ప్రజాశక్తి-అనంతపురం

ఫుట్‌వేర్ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన ఎఎస్‌సి అజంతా షూ కంపెనీ షోరూమ్‌ను అనంత నగరంలో ఆదివారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్ ప్రారంభించనున్నట్లు ఛైర్మన్ కోరా చలపతి, కోరా రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్ల అనుభవం కలిగిన అజంతా షూ కంపెనీ ప్రజలకు నాణ్యమైన పాదరక్షలను అందిస్తోందన్నారు. అలాంటి కంపెనీ అనంతపురంలో షోరూం ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా 10శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫైనాన్స్ డైరెక్టర్ గోపీకృష్ణ, ఎపి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అమన్ మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకూ అన్ని రకాల పాదరక్షలు తమ షోరూమ్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువతకు నచ్చే, మెచ్చే పాదరక్షలు వేల రకాల మోడల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల బస్సులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వంశీకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో ఉపయోగిస్తున్న బస్సుల కండిషన్లపై ఆర్‌టిఒ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎన్.వంశీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అనేక ప్రయివేట్ పాఠశాలలు కండిషన్ లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని వాపోయారు. ప్రయివేటు పాఠశాలల బస్సులు తరచూ ప్రమాదాలకు గురికావడమే ఇందుకు నిదర్శమన్నారు. అంతేగాకుండా ఆయా బస్సుల్లో అనుభవం లేని డ్రైవర్లతో నడిపిస్తున్నారన్నారు. కావున ఆర్‌టిఒ స్పందించి పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలు ఉపయోగిస్తున్న బస్సుల కండీషన్లను పరిశీలించాలని, డ్రైవర్ల అనుభవజ్ఞులా.. కాదా.. అనే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో భరత్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సిఐటియు అనుబంధ ఆశావర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పని చేస్తున్న ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, మట్టి ఖర్చులు కింద నగదు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిహెచ్‌సిలో కొంతమంది ఆశావర్కర్లను ఆయాల లాగా పని చేయిస్తున్నారన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆశావర్కర్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా సాకే నాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులుగా భాగ్య, ప్రమీల, కమిటీ సభ్యులుగా విమల, రెహానాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జనగణన కాదు.. కులగణన చేపట్టాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వం చేపడుతున్న జనగణన ముఖ్యం కాదని.. కులగణన చేస్తే ఆయా సామాజికవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుకు అనుకూలంగా ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ సూచించారు. శనివారం స్థానిక బిటి.పక్కెరప్ప భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న జనగణన కన్నా కులగణన చేపడితే ఏఏ సామాజిక వర్గాల ప్రజలకు చట్ట సభల్లో ఎంత శాతం రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టత వస్తుందన్నారు. ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో జనగణన చేపట్టారని చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకోసం ఢిల్లీలో ఎంపీలు పార్లమెంటు ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కులగణన కోసం ఈనెల 12న అన్ని కులసంఘాలు, రాజకీయ పార్టీలను సమీకరించి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, నాయకులు మహేష్, రామాంజినేయులు, ఎస్ఎండి.గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని పిటిసి మైదానంలో 43వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియనిషిప్ పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా పురుషులు, మహిళా క్రీడాకారులు భారీగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన దాదాపు 600 మంది క్రీడాకారులకు ముఖ్య అతిథులు మీనాక్షమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవికాంత్‌రమణ, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి గొప్ప క్రీడాపోటీల ద్వారా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ పోటీలను అనంతపురంలో నిర్వహించడం శుభపరిణామం అన్నారు. సాయంత్రం సప్తగిరి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకూ డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం భారీ ర్యాలీను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ కొండయ్య, మా అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్‌బాబు, ప్రెసిడెంట్ లక్ష్మీపతి రాజు, స్టేట్ సెక్రటరీ సైకం రామ్‌ప్రసాద్, జిల్లా సెక్రటరీ సికందర్, అసోసియేషన్ సభ్యులు సుంకర రమేష్, రోళ్ల భాస్కర్, నాగ శివ, సతీష్, నందిత, తదితరులు పాల్గొన్నారు.

తలుపూరు రోడ్డు పరిశీలన




రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం నుంచి తలుపూరు గ్రామానికి వెసిన తారురోడ్డును టిడిపి నాయకులు శనివారం పరిశీలించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తలుపూరుకు వచ్చిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు స్థానికులు తారు రోడ్డు వేయాలని విన్నవించారు. అప్పట్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తారురోడ్డు వేసిన తర్వాతనే గ్రామంలోకి వస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు రూ.1.20కోట్లతో తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో రోడ్డును టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆత్మకూరు మండల కన్వీనర్ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌బాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకుడు విశ్వనాథ్‌రెడ్డి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు బుక్కరాయసముద్రం విద్యార్థులు



రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బుక్కరాయసముద్రం : 8వ యూత్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు బుక్కరాయసముద్రం విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ గోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఫిబ్రవరి 9 నుంచి 11వతేదీ వరకూ కాకినాడ జిల్లా పిఠాపురంలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.చరణ్, యు.సంధ్య, వి. పల్లవి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీతోపాటు ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఉపాధ్యాయులు అభినందించారు.

చేతిపంపునకు మరమ్మతులు



చేతిపంపునకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల ఎస్సీ కాలనీ ఆర్‌డిటి పాఠశాల వద్ద మరమ్మతులకు గురైన చేతిపంపునకు సర్పంచు మల్లెల జగదీష్ శుక్రవారం మరమ్మతులు చేయించారు. చేతిపంపు చెడిపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు సర్పంచు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచు.. సమస్యలను ఆర్‌డబ్ల్యుఎస్ మెకానిక్ రామ్‌నాయక్ తెలిపి మరమ్మతులు చేయించారు. అదేవిధంగా చేతి పంపు చుట్టూ ఉన్న కంప చెట్లు, చెత్తాచెదారాన్ని తొలగించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన ఇబ్రహీం

రాయదుర్గం : రాయదుర్గం పట్టణ పొలిమేరలో జాతీయ రహదారి చెక్‌పోస్ట్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ తెలిపారు. పట్టణంలోని 17వ వార్డు గుగ్గిరట్టి ప్రాంతానికి చెందిన షేక్ ఇబ్రహీం (48) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మరొకరు గాయపడ్డారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని చాలువేముల గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఈశ్వరమ్మ శుక్రవారం ఉదయం కూలిపనికి వెళ్లింది. పని ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన బీగం పగులగొట్టి బీరువాలోని రూ.45వేల నగదుతోపాటు ఉంగరం కనపడలేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు.